


*(గత సంచిక తరువాయి)*

1992

హర్షద్ మెహతా స్టాక్ స్కాం – బ్యాంకుల డబ్బు తో స్టాక్ మార్కెట్ ను హడలు కొట్టిన 'బిగ్ బుల్'

పి.ఎల్. మహేష్ తెచ్చిన అకౌంట్ల వివరాలు చూస్తున్నాడు. కంపనీ మంచి లాభాలతో నడుస్తున్నది. విదేశీ అకౌంట్లలో కూడా డబ్బులు బాగానే జమ అయ్యాయి. దానికి కారణం ఇటలీ లోని లియో కంపనీ నే కాకుండా, ఇతర విదేశీ కంపెనీల నుండి కూడా ఆర్డర్లు రావడం. మొత్తంమీద ఈ విదేశీ ఎగుమతుల వ్యాపారం లో పి.ఎల్. కంపెనీలు బాగా నిలదొక్కుకున్నాయి. అప్పుడప్పుడు మాసిలామణి ద్వారా డబ్బులు హవాలా మార్గం లో తెప్పించినా, స్విస్ ఫ్రాంక్ విదేశీ మారక రేటు బలంగా ఉండడం వల్ల అక్కడే డబ్బులు ఉంచడంలో ఎక్కువ ఆదాయం, ఆస్తి చేసుకోవచ్చు నని మహేష్ చెప్పకనే పి.ఎల్. కు అర్ధం అయ్యిపోయింది. స్విస్ బ్యాంక్ లో డబ్బు బాగానే జమ అయ్యింది, ఎగుమతులతో బాటు ఎక్కువవ్వుతూనే ఉంది.

"ఓకే మహేష్. ఇవన్నీ బాగానే ఉన్నాయి. మన కంపనీ స్టాక్ మార్కెట్ లిస్టింగ్ కి వెళ్తుంది కదా. బ్యాంక్ వాళ్లు మన కంపనీ ఐ.పి.ఓ మనేజి చేయడానికి అకౌంట్ వివరాలు అడిగారు కదా. అవెక్కడ?", అని అడిగాడు పి.ఎల్.

"అవి ఈ ఫైల్ లో పెట్టాను", అన్నాడు మహేష్.

ఈ అకౌంట్లు పరిశీలించాడు పి.ఎల్. ఈ అకౌంట్లలో లాభాలేమి చూపెట్ట లేదు. నష్టాలే. దానితో టాక్స్ లు కట్టాల్సిన పని పడలేదు. ఇలా రెండు జతల అకౌంట్లు మనేజి చేయటంలో, ఆరితేరిపోయాడు మహేష్.

డబ్బు సంపాదించడం తో పాటు, పి.ఎల్ ఆ డబ్బును మరిన్ని కొత్త కంపెనీలు తెరవడానికి ఉపయోగించాడు.

విదేశాలకి తోళ్లను ఎగుమతి చెసే బదులు జోళ్ళు, హ్యాండ్ బ్యాగ్స్ ఎగుమతి చేస్తే ఎక్కువ లాభాలని, పి.ఎల్. కొన్ని కొత్త కంపెనీలు కట్టించాడు. ఈ కంపెనీలు చేసే జోళ్ళు, హ్యాండ్ బ్యాగ్స్ ఎగుమతి చేయడం మొదలు పెట్టడంతో, పి.ఎల్ కంపెనీలో వర్టీ కల్ ఇంటిగ్రేషన్ పూర్తి అయ్యింది.

దానితో పాటు, జనరిక్ మందులకు బాగా డిమాండ్ ఉందని పి.ఎల్. ఫార్మాసిటికల్స్ అంటూ మరో బిజినెస్ కూడా మొదలు పెట్టాడు.

"సరే బ్యాంక్ కు పోదాం పద. రీజినల్ మేనేజర్ వాళ్ళ ఎం.డి. తో మీటింగ్ సాయంత్రం 6 కన్నాడు. అన్నట్టు ప్రోమోటర్ కోటా షేర్లు ఇంకా ఎన్ని ఉన్నాయి", ఆడిగాడు పి.ఎల్.

"ఉన్న షేర్లలో ఇప్పటికే మినిష్టర్ బయప్ప రెడ్డి కి 20% ఇచ్చేసాము. అక్కడున్న ఆఫీస్ స్టాఫ్ కు మరో 5% పంచాం. బ్యాంక్ వాళ్ళ కోసం ఓ 10% అట్టేఉంచాను. దానికి అప్లికేషన్ లు కూడా మనతోనే తీసుకెళ్లాలి. ఇదో నా బ్యాగులో పెట్టాను", అని మరో సారి మహేష్ తన బాగ్ తెరచి చూసుకున్నాడు.

పి.ఎల్. , మహేష్ లు బ్యాంక్ వెళ్ళగానే, రీజినల్ మేనేజర్ తన టేబిల్ మీద ఉన్న పేపర్లు అన్ని పక్కకు తోసి, ఎదురుగా ఉన్న కుర్చీలలో వాళ్ళను కూర్చోమని, తానున్నది వారికోసమే అన్నట్లు ముఖం పెట్టి, ఆతృతగా వారి వైపు చూసాడు.

"మీరు అడిగిన వివరాలు, ఇవిగో నండి. అలానే ఐ.పి.ఓ అప్లికేషన్లు కూడా తెచ్చాను. మీ ఇంటి వారి పేర్ల మీద షేర్లు కొనుక్కోవచ్చు. ప్రమోటర్ అప్లికేషన్ లు కాబట్టి మీకు తప్పకుండా షేర్లు అందుతాయి. అందిన వెంటనే అమ్మినా లాభమే. కానీ మీరు ఆ షేర్ లు అమ్మక పోతేనే లాభం. మరో రెండు సంవత్సరాలలో వీటి విలువ ఓ వేయి శాతం పెరుగుతుంది అని నా నమ్మకం. అప్పుడు అమ్మితే మంచి లాభాన్ని పొందొచ్చు. అవసరం లేక పోతే ఈ షేర్లు మీ దగ్గర అట్టే పెట్టుకోండి. స్టాక్ స్ప్లిట్ ల వల్ల ఈ షేర్ ల విలువ ఇంకా పెరుగుతుంది", అన్నాడు మహేష్.

రీజినల్ మేనేజర్ మహేష్ ఇచ్చిన అప్లికేషన్ ఫార్మలు తీసుకుని టేబిల్ డ్రాయర్ లో పెట్టుకొని, గొంతు సవరించుకొన్నాడు.

"ఎం.డి. గారు కూడా మీతో మాట్లాడాలట. విషయం ఏంటి అంటూ తెలియదు", అన్నాడు రీజినల్ మేనేజర్.

రీజినల్ మేనేజర్, ఆఫీసు టవర్ మీది చివరి అంతస్తుకు పి.ఎల్. ను, మహేష్ ను తీసుకెళ్లాడు. ఆ అంతస్తులో ఉన్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసులు ఎదో స్టార్ హోటల్ పెంట్హౌస్ లాగా ఉన్నాయి. ఎం.డి. ఆఫీసు ఆ అంతస్తులో సగం పైనే ఆక్రమించుకుంది. ముందు ఏం.డి. పర్సనల్ అస్సిస్టెంట్ ఆఫీసు కు వెళ్లారు. ఆవిడ వాళ్లను అక్కడున్న లెథర్ సోఫాలలో కూర్చోమని ఎం.డి. రూమ్ కు వెళ్ళి, వచ్చి "ఓ ఐదు నిమిషాలు. మీ ముందు వచ్చిన వారితో మీటింగ్ ఆయిపోవచ్చింది", అని చెప్పింది. చక్కగా డ్రెస్ చేసుకున్న సర్వర్ వాళ్లకు టీ, కాఫీలు అంద జేసీ జీడిపప్పులు, బిస్కెట్లు ఉన్న ప్లేట్లు వారి

ముందున్న సెంటర్ టేబిల్ మీద పెట్టాడు. ఓ ఐదు నిమిషాల తరువాత ఎం.డి. తలుపులు తీసుకొని ఓ నలుగురు బయట పడి, పెర్సొనల్ అసిస్టెంట్ చూసి నవ్వుతూ, థాంక్స్ అని వీడ్కోలు తీసుకోవటంతో, రీజినల్ మేనేజర్, పి.ఎల్. ను, మహేష్ ను తీసుకొని ఎం.డి. రూంలో అడుగు పెట్టారు.

పరిచయాల తరువాత ఎం.డి.

పి.ఎల్ ను అభినందిస్తూ , "మా బ్యాంక్ ఇన్వెస్ట్మెంట్ డివిషన్ రిపోర్ట్ కూడా ఇప్పుడే చూసాను. మీ ఐ పి ఓ వల్ల కనీసం పదింతలు  డబ్బు జమ అవ్వాలి. ఉన్న షేర్ ల కంటే ఎక్కువ షేర్ లకు జనాలు అప్లై చేస్తారని  అంచనా", అన్నాడు.

వెంటనే రీజినల్ మేనేజర్ వైపు తిరిగి," ఇన్వెస్ట్మెంట్ డివిషన్ హెడ్ ను రమ్మన్నాను. కొంచెం వెళ్లి, నీ తో పాటు తీసుకొస్తావా. నేను, ఇద్దరూ కలిసి వస్తారనుకున్నాను", అని రీజినల్ మేనేజర్ ను రూమ్ బయటకు పంపించేశాడు.

పి.ఎల్. కు వెంటనే విషయం అర్ధం అయ్యిపోయింది. ఎం.డి. కి థాంక్స్ చెప్తూనే మహేష్ వైపు చూసాడు. మహేష్ ప్రోమోటర్ కోట ఐ పి ఓ అప్లికేషన్లు టేబిల్ పైన పెట్టగానే, ఎం.డి. వాటిని తోసేసి, "పి.ఎల్. మీకు పిల్లలెంత మంది. ఏమి చేస్తున్నారు", అని నవ్వుతూ ఆడిగాడు. ఆ నవ్వు లో మనం చిరకాల స్నేహితులమనే సందేశం ఉంది.

"ఒక్కబ్బాయే నండి. ఊటీ బోర్డింగ్ స్కూల్లో ఉన్నాడు", అంటూ, "మీ కెంత మంది పిల్లలు?",  సంభాషణ పొడిగించడానికి ఎం.డి. ని అడిగాడు పి.ఎల్.

"ఓ అమ్మాయి, ఓ అబ్బాయి. అమ్మాయి పెళ్లి గత సంవత్సరమే అయ్యిపోయింది. అబ్బాయి ఈ ఆగస్టులో పై చదువులకని అమెరికా పోతున్నాడు. మీకు తెలిసిందే కదా ఈ విదేశీ మారక రేగులేషన్ లు.

కష్ట పడతాడేమో. నేను వాడికి ఈ కష్టాలన్నీ చెప్పాను. కానీ వింటేగా, పోవాలనే పట్టు బట్టాడు. ఆ ఏర్పాట్లతోనే ఉన్నాను", అన్నాడు ఎమ్.డి.

పి.ఎల్ కు విషయం మరింత స్పష్టమైంది.

"కంగ్రాట్స్ అండి. పిల్లాడు చదువుతాననంటే మంచిదే కదా. మాది ఎక్సపోర్ట్స్ బిజినెస్ కాబట్టి, నాకు తెలిసిన వారు అమెరికా లోను ఉన్నారు. వాళ్ళతో మాట్లాడి మీ అబ్బాయికి అన్నీ ఏర్పాట్లు సజావుగా చేద్దాం", అన్నాడు పి.ఎల్.

అటు తరువాత పి.ఎల్. ఎం.డి మధ్య సంభాషణ రూపే మారిపోయింది. వారు నిజంగా చాలా ఏండ్ల నుండి పరిచయం ఉన్న వారి లాగా మాట్లాడ సాగారు. మహేష్ అనుకున్నట్లు, ఐ పి ఓ కాంట్రాక్ట్ గురించి కానీ, తమ కొత్త బిజినెస్ కోసం బ్యాంక్ తో లావా దేవీలు చేస్తున్న వంద కోట్ల లోన్ల గురించి ఒక్క మాట మాట్లాడ లేదు.

రీజినల్ మేనేజర్, ఇన్వెస్ట్మెంట్ హెడ్ తో వాపసు వచ్చిన తరువాత ఆ ప్రసక్తి వస్తుందేమో నని, తలుపు వైపు అప్పుడప్పుడు మహేష్ చూడడం మొదలెట్టాడు.

ఇంతలో వచ్చే శుక్రవారం రాత్రి గొప్పవాళ్ళు కొందరు మాత్రమే కలుసుకునే క్లబ్ లో కలుద్దామని పి.ఎల్, ఎం.డి. చేతులు కలిపి వీడ్కోలు తీసుకున్నారు.

మహేష్ కు అంతుబట్టలేదు. పి.ఎల్. ను చూస్తూ " మన పని పూర్తి కాలేదు పి.ఎల్ గారు. మీరు అలానే రీజినల్ మేనేజర్ రాక ముందే ఎం.డి. రూమ్ నుండి వచ్చేసారు", పనులు పూర్తి కాలేదే అన్న ఆందోళనతో అన్నాడు, మహేష్.

పి.ఎల్. నవ్వుతూ," ఎం.డి. వాళ్ళబ్బాయి గురించి మనతో మాట్లాడినప్పుడే మన పని అయ్యిపోయింది. నా అంచనా సరి అయ్యితే, రీజినల్ మేనేజర్ తన రూంకు వెళ్ళిపోయి మన కోసం ఎదురు చూస్తూ ఉంటారు. ఓ మాట మాట్లాడి వీడ్కోలు తీసుకుందాం. రీజినల్ మేనేజర్ మన లోను తప్పక సాంక్షన్ చేయిస్తాడు. ఏమైనా అడ్డంకులు వస్తే నాకు చెప్పు, ఎం డి. తో నేను నేరుగా మాట్లాడుతాను", అన్నాడు పి.ఎల్

"అంటే ఇక మీదట రీజినల్ మేనేజర్ తో నన్నే సంప్రదించమంటారా? మీరు అవసరం లేదా?" అడిగాడు మహేష్.

"అంతేగా. మన కొత్త కంపెనీలకి నీవే చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ కదా. సరి పోతుంది. అన్నట్టు వచ్చే వారం ఆ ఎం.డి. అబ్బాయి వివరాలు పంపిస్తాను. మన స్విస్ అకౌంట్ నుంచి, నీవు ఆ అబ్బాయి కాలేజ్ ట్యూషన్ ఫీస్, అక్కడ ఉండడానికి కావలసిన అన్ని సదుపాయాల ఖర్చు కి డాలర్లు పంపించు. ఆ అబ్బాయి రెండేళ్ల చదువు ఖర్చు మనదే", అన్నాడు పి.ఎల్.

రీజినల్ మేనేజర్ తిరిగి ఎందుకు రాలేదో, ఇక ముందు తను మాత్రమే రీజినల్ మేనేజర్ ను ఎందుకు కలవాలో అర్ధం అయ్యింది మహేష్ కు.

రీజినల్ మేనేజర్ పి.ఎల్. అన్నట్లు తన ఆఫీస్ రూమ్ లోనే ఉన్నాడు, మహేష్, పి.ఎల్ రాకకు ఎదురుచూస్తూ.

–13 –

టాంప, ఫ్లోరిడా

జులై, 2014

విశ్వం, కారు వాలే అబ్బాయికి పార్కింగ్ కని ఇచ్చి, ఆసుపత్రి లోపలకి వెళ్ళాడు. తన వార్డు ఫస్ట్ ఫ్లోర్ లొనే ఉండడంతో పెద్దగా నడువనవసరం లేక పోయింది. తను వచ్చినట్లుగా చెక్ ఇన్ కంప్యూటర్ లో చేసి, కూర్చో మంది ఫ్రంట్ డెస్క్ లో ఉన్న చిన్న పిల్ల. ఇది లాభాపేక్షలు లేని సంస్థ కాబట్టి, ఫ్రంట్ డెస్క్ లాంటి పనులు చేసేది వాలంటీరులే.

సాయంత్రం కాబట్టి పొద్దున్న నుంచి వస్తున్న పేషంట్ల అలస్యాలన్ని కలిసి ఓ అర గంట పైనే వేచి ఉండాల్సి వచ్చింది.

అరగంట తరువాత ఆఫీసు రూములో తీసుకెళ్లి కూర్చో బెట్టారు. మామూలు గా వెళ్లే ఎక్సమ్ రూమ్ లా లేదు. బయాప్సీ రిపోర్ట్ గురించి తెలుసుకోవడమే కదా అని విశ్వం సరి పుచ్చు కున్నాడు. ఓ ఐదు నిమిషాల తరువాత ఆసియా, ఆఫ్రికా వాసుల పోలికలు కలిసిపోయిన, చామనఛాయా రంగున్న ఓ 45 ఏళ్ల వ్యక్తి తలుపు తట్టి లోపలికి వచ్చాడు.

"హలో విశ్వం, హౌ ర్ యు. నాపేరు షాన్. నేను మీ డాక్టర్ కింద పని చేసే నర్స్ ప్రాక్టీషనేర్. మీ బయాప్సీ రిపోర్ట్ మీ తో పాటు చదివి వివరిస్తాను. దాని తరువాత ఏమి చేయ వచ్చునో కూడా మాట్లాడుకుందాం", అన్నాడు.

రిపోర్ట్ తీసి ముందు ప్రోస్టేట్ లో ఎక్కడెక్కడ పొడిచి స్పెసిమెన్లు సేకరించారో చూపెట్టాడు. మొత్తం 16 సార్లు అన్ని పక్కల పొడిచి 16 స్పెసిమెన్ లు తీసుకున్నారు. అందులో సగం పైన స్పెసిమెన్లలో కాన్సర్ కనిపించింది. పేతాలజీ వారు కణాలను గ్లీసన్ స్కోర్ మేరకు 1 టి నుంచి 5 వరకు మార్కులు వేస్తారు. 5 అంటే కాన్సర్ బాగా ముదిరినట్టు. 1 అంటే నార్మల్. అలానే కణాలు ఉండే పేటర్న్ లను బట్టి వివిధ గుంపులులుగా విభజించి మరో మారు 1 నుంచి 5 వరకు స్కోర్ చేస్తారు. ఈ రెండు సంఖ్యలను గ్లీ సన్ స్కోర్ పరీక్ష ఫలితాలుగా గుర్తిస్తారు.

విశ్వం మోదటి గుంపు కణ జనాల స్కోర్ 3 వచ్చింది.

రెండో గుంపు కణ జనాల స్కోర్ 4. రెండు కలిపి 7.

స్కోర్ 6 లోపల ఉంటే పెద్ద సమస్య లేదు. ఇంకా కొన్ని ఏళ్ళు ఆక్టివ్ గా మానిటర్ చేయవచ్చును. అలానే స్కోర్ 8 పైన ఉంటే కాన్సర్ వేగంగా పెరుగుతున్నది అని వెంటనే ఎదో ఒక ట్రీట్మెంట్ మొదలెట్టాలి. ఇలా మధ్య స్కోర్ 7 లా వస్తే సమస్యనే. ఆ మాటే షాన్ వివరిస్తూ," మీకు మరింత ఋజువు, వివరాలు తెలియాలంటే ఎం ఆర్ ఐ స్కాన్ ఆర్డర్ చేయ

గలను. ఆ స్కాన్ చూసిన తరువాత మీరు ఓ సారి రేడియాలజీ డాక్టర్ ను కూడా కలవండి. మా సర్జన్ ఆపరేషన్ చేయ గలిగినా, పేషెంట్ కావలసినంత సమాచారం అంద జేసిన తరువాతే ఆ నిర్ణయం పేషెంట్ తీసుకోవాలన్నది మా సెంటర్ పాలసీ. మీకు రెండు అప్పాయింట్మెంట్లు చేస్తాను. పది రోజుల తరువాత మళ్లి కలుద్దాం", అని చెప్పాడు.

విశ్వం ఎదురు చూస్తున్నదే అయ్యినా ఈ రిపోర్ట్ విన్న తరువాత విశ్వం మెదడు మొద్దు బారిపోయింది. లాజికల్ కాక పోయినా, ఎం ఆర్ ఐ స్కాన్ తరువాత కాన్సర్ లేదంటారేమో అన్న ఆశ కలిగింది. తిరిగి తనే సెల్ఫ్ డెనియల్ స్థితి లో ఉన్నానని, క్యాన్సర్ ఉందని ఒప్పుకోవడానికి సమయం పడుతుందని, అనుకున్నాడు.

విశ్వం ఆలోచనలు ఇన్సూరెన్స్ మీద మళ్ళాయి.

విశ్వం కు కంపెనీ హెల్త్ ఇన్సూరెన్స్ మంచిదని, అన్నీ కవర్ చేస్తుందని తెలుసు. ఇన్సూరెన్స్ లేకపోతే ఈ ఖర్చులు తాను భరించడం అసాధ్యం. తప్పకుండా అప్పులు పాలు అయ్యేవాడు. అది గుర్తు రాగానే ఓ వైపు ఇన్సూరెన్సు ఉందని సంతృప్తి, మరో వైపు దీని కోసమైనా ఉద్యోగం కాపాడుకోవాలి అన్న ఆందోళన కలిగాయి విశ్వంకు.

చెక్ ఔట్ చేసినప్పుడు, ఫ్రంట్ డెస్క్ పిల్ల, రెండు అప్పాయింట్మెంట్ల డేట్లు, టైము ఇచ్చింది. విశ్వం కు వెంటనే బెత్ గుర్తుకు వచ్చింది. మళ్లీ రెండు రోజులు టైం ఆఫ్ అంటే ఊరుకుంటుందా. కంపెనీ కూడా మరీ దరిద్రంగా తయారు అయ్యింది. ప్రతీ సంవత్సరం బిల్లియన్లు లాభాలు సాధించినా, కాస్ట్ కటింగ్ అని ప్రతీ డిసెంబర్ లో కొంతమంది ని తీసేస్తున్నారు. జాగ్రత్తగా ఉండాలి అనుకున్నాడు.  వాలే అబ్బాయి నుండి కారు తీసుకొని ఇంటికి వెళ్తుంటే, రాబర్ట్ గుర్తుకు వచ్చాడు. వేగస్ పోయిన తరువాత పిరమిడ్ కంపనీ, రెడ్ రాక్ హోటల్  గురించి మాట్లాడనే లేదు. అలానే ఈ బయాప్సీ రిపోర్ట్ డాక్టర్ వెంకటేసులుతో మాట్లాడాలి. ఇంట్లో సీత కూడా రిపోర్ట్ గురించి అతృతతో వేచి చూస్తుంటుంది. సీతకు ఇంటికి పోయి తీరికగా చెప్పొచ్చు. ముందు రాబర్ట్ కు ఫోన్ చేసాడు. వాయిస్ మెయిల్ కి వెళ్ళింది. తాను వేగస్ వెళ్లానని, వీలున్నప్పుడు కాల్ చేయమని చెప్పి పెట్టేసాడు విశ్వం.

డాక్టర్ వెంకటేసులు కూడా తీరిక లేకుండా ఉన్నట్టున్నారు. ఆయనకీ, బయాప్సీ రిపోర్ట్ వచ్చిందని, తను మెయిల్ లో పంపిస్తున్నానని, సర్జరీ కి అంత తొందర లేదేమోనని వాయిస్ మెయిల్ పెట్టేసాడు విశ్వం. సీత ఈ రిపోర్ట్ ఎలా తీసుకుంటుందో అన్న ఆందోళన, విశ్వం మనస్సులో ఎక్కడో దాగి అప్పుడప్పుడు ఎగిరి గంతులేస్తున్నది.

–14 –

1995

వర్ల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ లో భారత్ చేరిక

పి.ఎల్. ను కలవడానికి మహేష్ వచ్చాడు. కంపెనీ పబ్లిక్ ఆఫరింగ్ తరువాత బాగా మార్పులు వచ్చేసాయి. తోలు వ్యాపారమే కాక, ఫార్మస్యూటికల్స్, హోటల్స్ విభాగాలు కూడా మొదలు పెట్టారు. కెమికల్స్ తయారు చేయడానికి ఓ పథకం పై మహేష్ పనిచేస్తున్నాడు. కెమికల్స్ కంపనీ కి పెట్టుబడి ఎక్కువ. కానీ కంపిటేషన్ బాగా తక్కువే. కొత్త కంపెనీ, మొత్తం గ్రూప్ ఎదుగుదలకు బాగా సరిపోతుంది అని అంచనా. పి.ఎల్. ఓ రెండేళ్ల క్రితమే, కార్పొరేట్ ఆఫీస్ అని ఓల్డ్ మహాబలిపురం రోడ్ మీద కట్టాడు. మకాం కూడ చెన్నైకి మార్చేసాడు. ఇల్లు కూడ వి.జి.పి. గోల్డెన్ బీచ్ రిసార్ట్ పక్కనే సముద్ర తీరం దగ్గర ఉంది.

పి.ఎల్. ఆఫీసు కు మూడు వైపులా అద్దాల గోడలే. నిలువుటెద్దు తెరలు తెరిచే ఉన్నందువల్ల, ఎదురుగా బంగాళా ఖాతం లోని సుముద్రపు అలలు, నీలం తివాచీ పైన దొర్లుతున్న తెల్లటి ముత్యాల సరాల లాగా ఉన్నాయి.

"కూర్చో మహేష్. కెమికల్స్ ప్రాజెక్ట్ గురించేనా?", అని అడిగాడు పి.ఎల్.

"అవునండి. ఎస్టిమేట్లు చూస్తుంటే ఈ ప్రాజెక్ట్ వల్ల, పెద్ద లాభం రాకపోవచ్చును, ఆ లాభాలు ఓ 10 ఏండ్లు పడతయాయేమో రావడానికి", అన్నాడు మహేష్.

"ఏంటి మార్గం. నీ అభిప్రాయం చెప్పు", అని అడిగాడు పి.ఎల్.

"మనకు కొంచెం ప్రభుత్వ సహకారం కావాలి. ఫ్యాక్టరీ కని మనం దిగుమతి చేసుకోబోయే మషీన్ల ల మీద 50% దిగుమతి పన్ను ఉంది. అదే మషీన్లు సెకండ్ హాండ్ యూజడ్ మషీన్లు అంటే ఆ పన్ను 10% మాత్రమే. అలా చేస్తే మొదటి సంవత్సరమే మనం లాభాలు చూడచ్చు. అలానే మన పార్టనర్ అయ్యిన ఆ కొరియా కంపెనీ కాంట్రాక్ట్ కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలి. సైన్ చేసిన వెంటనే రాష్ట్ర ప్రభత్వం నుంచి 100 ఎకరాల భూమి సాంక్ షన్ కావాలి", అన్నాడు మహేష్.

"ఎవరు ఈ విషయం లో సహాయ పడతారు? పోనీ ఓ పని చేయి. మనం ఆ మినిస్టర్ బయప్ప రెడ్డి కి వారి మనుష్యులకు ఇప్పటికే ఐ.పి.ఓ షేర్లు అంద జేసాము. బయప్ప రెడ్డి ని కలవడం సులువే అవ్వుతుంది. ఆయనతో ఓ మీటింగ్ అరేంజి చేయి. ఢిల్లీకి నీకు, నాకు టిక్కెట్లు బుక్ చేయి. ఆ సమస్య కు ఓ పరిష్కారం దొరుకుతుంది. ఈ లోపల

మనకు మషీన్లు సప్లై చేస్తున్న వారి తో మాట్లాడి వాళ్ళు కొత్త మాషీన్లు మనకు పంపిస్తున్నా, ఇన్వాయిస్ మీద సెకండ్ హాండ్ మాషీన్లు అని రాసి 200 కోట్లకు బిల్ చేస్తారేమో కనుక్కో. వాళ్లకు రావలసిన 500కోట్ల లో 300 కోట్లు మన స్విస్ అకౌంట్ లోనుంచి పంపించేయి. చాలా మటుకు, ఆ డబ్బు ను వాళ్ళ స్విస్ అకౌంట్ లోనే వేయమంటారేమో. వారికి లాభం, మనకు లాభం. ఈ విషయం కూడా బయప్ప రెడ్డి కి ముందే చెప్తాను", అని పి.ఎల్. మహేష్ తో మీటింగ్ ముగించబోయాడు.

మహేష్ "సార్. మరో విషయం. మన కంపెనీ టాక్స్ రిటర్న్ లు ఆడిట్ కి వచ్చాయి. చాలా ప్రశ్నలు వేస్తున్నారు. ఫైన్ లు వేస్తామంటున్నారు. కోర్ట్ కు కూడ లాగుతామంటున్నారు", అన్నాడు.

"మహేష్ ఇలాంటి విషయాలు, నా దగ్గర దాక ఎందుకు తెస్తున్నావు. అది నీ పనే కదా. అయినా, నేను చెప్పాలా ఇవి ఎలా మేనేజ్ చేయాలని. వినోద్ మనకు తెలిసిన వాడే కదా. క్లాస్ 1 ఆఫీసర్ గా ఆ టాక్స్ డిపార్ట్మెంట్ లోనే చేరాడు.కనుక్కో ఎలా బయట పడాలని", అన్నాడు పి.ఎల్.

"ఈ ప్రశ్నలు లేవదీసింది వినోదే సార్. చూసుకుంటాను లెండి. ఓ మాట మీకు చెప్పుదామని చెప్పానంతే", అన్నాడు మహేష్.

"వినోద్ చూస్తున్నాడా మన రిటర్న్స్. అతనికి మన బిజినెస్ గురించి బాగా తెలుసు. మన అకౌంట్లు, ఫ్యాక్టరీలు అన్నీ చూసేసాడు. అతను ప్రశ్నలు వేస్తున్నాడంటే, ఆశ్చర్యం ఏమి లేదు", అన్నాడు పి.ఎల్.

"నేను చూసుకుంటాను సార్", అని మహేష్ వీడ్కోలు తీసుకున్నాడు.

టాక్స్ వాళ్ళు ఏవో ప్రశ్నలు వేసి ఆఫీస్ కు పిలిస్తే, వెళ్లిన మహేష్ కు అక్కడ వినోద్ ను కలవడం ఆశ్చర్యమేసింది. అసిస్టెంట్ కమిషనర్ గా ఇంత చిన్న వయస్సులోనే పనిచేయడం చూస్తే ముచ్చట గా కనిపించింది. తనకనే ఈ పెద్ద ఆఫీస్ రూమ్, అతనిని కలవాలని వేచి ఉన్న జానాన్ని అదుపులో పెట్టి, వినోద్ ఆఫీస్ కు కాపలా కాస్తున్న ద్వారపాలకులు. వినోద్ తీరే మారిపోయింది. ఒక విధంగా మహేష్ కు తమకు తెలిసి, మంచి వాడని అభిప్రాయం ఉన్న వినోద్ కి ఈ మార్పు రావడం సంతోషమనే అనిపించింది. వినోద్ మహేష్ ను ఆప్యాయంగానే పలుకరించాడు. కానీ తరువాత అతను కంపెనీ రిటర్న్ లో ఒక ప్రశ్న తరువాత మరో ప్రశ్న వేస్తుంటే చెమటలే పోసాయి మహేష్ కి.

"మీరు చూపుతున్న సేల్స్ ఆదాయానికి, మీరు ఎగుమతి చేస్తున్న తోళ్ల విలువకి ఏమాత్రం సంబంధం లేదు. నష్టానికి ఎగుమతి చేస్తున్నట్లు చూపెడుతున్నారు. మీకు నిజంగా వచ్చిన ఆదాయం మీద పన్ను ఎగగొట్టాలనే కదా, మీరు అలా రిపోర్ట్ చేస్తున్నారు", అన్నాడు వినోద్.

"అబ్బే అదేమి కాదు. ఎగుమతి చేసాక, మా దగ్గర కొన్న తోళ్ల క్వాలిటీ తక్కువని, మేము చేసిన బిల్లింగ్ కంటే తక్కువే మాకు ముట్టజెప్పారు", అన్నాడు మహేష్.

"మీ తోళ్ల క్వాలిటీ టాప్ అని నాకు తెలుసు. మీ ఫ్యాక్టరీ లలో తయారు అయ్యే తోళ్లను నేను స్వయంగా చూసాను. నమ్మశక్యంగా లేదు. పోనీ మాట వరుసకు, అది నిజమే అనుకుందాం. మీ దగ్గర ఇది జరిగిన దానికి ఋజువుగా, మీరు అమ్మిన ఇటలీ కంపెనీల నుండి ఏమైనా ఉత్తరప్రత్యుత్తరాలు ఉంటే చూపెట్టమని ఓ నెల క్రితం అడిగాను. ఇంత వరకు సమాధానం లేదు", అన్నాడు వినోద్.

"పంపిస్తాను. ఆఫీసు లో కనుక్కొని నేనే మనిషితో పంపిస్తాను", అన్నాడు మహేష్. అప్పటికప్పుడు, పంపిస్తానన్నాడు కాని, ఎలా పంపించాలో మహేష్ కి అర్థం కావటం లేదు. టాక్స్ కట్ట కూడదనే కంపెనీ నష్టాలలో నడుస్తున్నదని చూపెట్టాం రిటర్న్స్ లో. చాలా మటుకు చూసి చూడ నట్లు వదిలేస్తారు. ఒకవేళ పట్టినా, ఎదో క్లర్క్ తమ ఆఫీసుకు వచ్చి అంతో ఇంతో చేతిలో పట్టుకొని పోతాడు. ఇలా ఆఫీస్ కు పిలిచి, నేరుగా కమిషనరే ప్రశ్నించడం ఇదే మొదటి సారి. పి.ఎల్ కంపెనీ ల మీద వినోద్ ఇదివరకే అవగాహన ఉన్నందు వల్ల అది జరిగిందా? కాని వినోద్ గురించి తెలుసు కాబట్టి, అతను అన్నీ కంపెనీల రిటర్న్ లు ఇంతే క్షుణ్ణంగా పరుశీలిస్తాడేమో అనుకున్నాడు మహేష్.

"అంతే కాదు మహేష్ గారు, మీ లైఫ్ స్టయిల్ నాకు చూచాయగా తెలుసు. కానీ రిటర్న్ లో మీకు చాలా తక్కువ జీతాలిస్తున్నారు అని రిపోర్ట్ చేస్తున్నారు. మీకిచ్చినట్లు చూపెడుతున్న జీతాలు ఓ మధ్య తరగతి పని వాళ్లకు సరిపోతుంది. అలాంటింది, మీరు బీసెంట్ నగర్ లో ఓ పెద్ద బంగళలో ఎలా ఉండ గలుగుతున్నారు. మీకనే ఓ కారు, డ్రైవర్ పెట్టుకోగల స్థోమత ఎలా వచ్చింది?", అడిగాడు వినోద్.

"అవన్నీ కంపనీ ఇచ్చిన సదుపాయాలు. ఏవి నావి కావు', అన్నాడు మహేష్.

"సరే మీరన్నది, నిజమనుకుందాం. మరి మీరు వ్యక్తిగతంగా ఫైల్ చేసిన రిటర్న్ ఈ సారి ఆడిట్ చేయ మంటారా? అందులో ఈ సదుపాయాలు మీకు మీ కంపెనీ ఇచ్చింది అని రిపోర్ట్ చెసార?" అడిగాడు వినోద్, ఆఫీసు రూమ్ కి మహేష్ తో వచ్చిన కేస్ ఆఫీసర్ కు సంజ్ఞ చేస్తూ.

మహేష్ కు విషయం అర్థం అయ్యిపోయింది. తన వ్యక్తి గత రిటర్న్ లో రిపోర్ట్ చేయలేదు. వినోద్ కు సమాధానాలు చెప్పి అతనిని ఒప్పించడం అసాధ్యం. మహేష్ తాము పి.ఎల్. కంపెనీ అకౌంట్లలో చేసే విన్యాసాలు, ఇలా బట్ట బయలు అదీ టాక్స్ కమిషనేర్ ముందు ఎలా చేయగలుగుతాడు. పి.ఎల్. , పి.ఎల్ కంపెనీల పరువు ప్రతిష్టలు పోతాయి. జైలు, ఫైన్ లు ఎదురొస్తాయి.

"మేము ఇప్పుడిప్పుడే కొత్త విధంగా రిటర్న్స్ ఆడిట్ చేయడం మొదలెట్టాం. కంపెనీ రిటర్న్స్ తో బాటు కంపెనీకి పని చేస్తున్న వారి వ్యక్తిగత రిటర్న్స్ కూడా పరిశీలిస్తాము. అలానే ఒక కంపెనీ రిటర్న్ అదే బిజినెస్ చేస్తున్న ఇతర కంపెనీల రిటర్న్ ల తో పోల్చి, పరిశీలిస్తాం...", వినోద్ చెప్తూనే ఉన్నాడు.

మహేష్ కు ఈ పాటికి, పరిస్థితి అర్థం అయ్యిపోయింది. ఈ సమస్య వినోద్ తో తీరిపోయేది కాదు. వినోద్ మాటలకు ఏదో క్లుప్తంగా జవాబులిస్తూ, తల ఊపు తున్నా, మహేష్ మైండ్ ఈ సమస్యను ఎలా పరిష్కరించాలి అన్న ఆలోచనలతో నిండి పోయింది. ఎలానో మీటింగ్ పూర్తి చేసి బయట పడ్డాడు.

మరుసటి రోజు పి.ఎల్. ను కలిసి, వినోద్ గురించి, అతను తమ బిజినెస్ కు ఎలా అడ్డంకులు వేస్తున్నాడో వివరించాడు. పి.ఎల్. కు ఈ సమస్య పరిష్కారం మహేష్ వల్ల కాదని తెలిసిపోయింది. తను బరిలో దిగాల్సిందే. నేను చూసుకుంటానని చెప్పి, మహేష్ ని పంపించేశాడు పి.ఎల్.

ఓ వారం తరువాత వినోద్ పి.ఎల్ కంపెనీ ఫైల్ తీసుకొని తన పైన పని చేస్తున్న కమిషనేర్ ఆఫీసు రూమ్ కు వెళ్ళాడు. ఎంతో ఉత్సాహంగా, తను కనుకున్న తప్పులను దాని వల్ల టాక్స్, దాని పైన పెనాల్టీ లతో బాటు, అదనంగా ప్రభుత్వానికి రావలసిన ఆదాయం గురించి మాట్లాడాడు.

అంతా ఓపికగా విన్న కమిషనేర్

"వినోద్ గ్రేట్ జాబ్. ఆ ఫైల్ అక్కడ పెట్టి వెళ్ళు. నేను కూడా పరిశీలించి, నా నోట్, తరువాతి చర్యల గురించి రాసి పంపిస్తాను", అని వినోద్ ను రూమ్ బయటకు పంపించేశాడు.

వినోద్ రూమ్ బయటకు పోయిన వెంటనే, ఫోన్ తీసి బయప్ప రెడ్డి సెక్రెటరీ కి డయల్ చేసాడు కమిషనేర్

సెక్రటరీ ఫోన్ ఎత్తగానే, "రెండు రోజుల క్రితం బయప్ప రెడ్డి చెప్పామన్నారు అని పి.ఎల్. కంపెనీలకు సమస్య లేవి కలిగించ వద్దు, ఆడిట్ ఆపేయా మని మీరు తెలిపారు. ఇప్పుడే ఆ కంపెనీ ఫైల్ నా డెస్క్ కు వచ్చింది. దానిని పెండింగ్ లో పెట్టేసాను అని బయప్పరెడ్డి కి చెప్పండి" అన్నాడు.

బయప్ప రెడ్డి సెక్రెటరీ బయప్ప రెడ్డి తో బాటు, ఈ వార్త పి.ఎల్. కూడా ఫోన్ చేసి చెప్పాడు.

పి.ఎల్. ఈ టాక్స్ సమస్యను పరిష్కరించాను, అని సంతోష పడుతుండగా, కని చెల్వి, లంచ్ కని అడయార్ గేట్ హోటల్ కు పిలిచింది. అరసు సెలవులకని ఊటీ బోర్డింగ్ స్కూల్ నుండి వచ్చాడు. ఇంకో రెండేళ్ల తరువాత కాలేజి కని అమెరికా పంపించాలి. మొన్న అమెరికాలో ఉన్న తన మందుల కంపెనీ పార్టనర్ ను కలిసినప్పుడు, అబ్బాయి చదువు విషయం తన మీద వదిలేయమన్నాడు. తరతరాలుగా ఐవీ కాలేజీలకు విరాళాలు ధారాళంగా ఇస్తుండడం వల్ల ఇలా పిల్లలకు సీట్లు తెప్పించడం పెద్ద కష్టం కాదు అని చెప్పాడు. అలా అరసు చేత ఓ బి బి ఏ అటు తరువాత ఎం బి ఏ చేయిచేస్తే, పి.ఎల్ గ్రూప్ కంపెనీల బాధ్యత తను బ్రతికి ఉండగానే క్రమంగా అప్పగించేయవచ్చు, అనుకున్నాడు పి.ఎల్.

మెర్సిడెస్ కార్ దిగి అడయార్ గేట్ హోటల్ రెస్టారెంట్ లో అడుగు పెడుతూనే, పి.ఎల్. ను గుర్తించి, కని చెల్వి, అరసు కూర్చున్న టేబిల్ కు వెంటనే ఉండి తీసుకెళ్లారు అక్కడున్న అషర్.

కని చెల్వి అప్పటికే ఆర్డర్ చేసినందు వల్ల, పి.ఎల్. కూర్చున్న వెంటనే అరసుతో కబుర్లు మొదలెట్టాడు. పెంపకం వల్ల, పి.ఎల్. ను తరచుగా చూడక పోవడం వల్ల కొంత బిడియం తో కూడిన ఆనందంతో అరసు పి.ఎల్. తో మాట్లాడడం మొదలెట్టాడు.

"అప్పా, ఆయషా, సలీం లను కలిసాను. మనింటి దగ్గర్లోనే ఉన్న డ్రైవ్ ఇన్ థియేటర్ లో సినిమాకి పోమా అని అడిగాడు", అరసు.

"ఆయష, సలీంలు, పీర్ పిల్లలు కదూ. పీర్ చెన్నై ఎప్పుడు మారాడు?", అని అడిగాడు పి.ఎల్.

"పీర్ లెథర్ ఎక్స్పోర్ట్ కౌన్సిల్ లో చేరాడు కదండీ. ఆఫీసు దగ్గరని బీసెంట్ నగర్లో ఇల్లు తీసుకున్నారు. పీర్, జుబేదా కూడా సినిమాకి వస్తామన్నారు. మీరు రావచ్చు కదా అంది", కని చెల్వి.

"పీర్ చెన్నై లోనే ఉన్నాడా? ఓ సారి కలవాలి. మీరు వెళ్ళండి సినిమాకి. నాకు ఇంకో బిజినెస్ మీటింగ్ ఉంది ఆ సమయంలో", అన్నాడు పి.ఎల్.

అరసు ముఖం ఒక్క సారి వెలిగి పోయింది. ఆయషను, సలీం లను కలుస్తున్నా అనే ఆనందంతో. పి.ఎల్. కని చెల్వి ఆ ఆనందం సినిమా చూడబోతున్నందుకు అనుకున్నారు.

ఇంతలో సర్వర్ కని చెల్వి ఆర్డర్ చేసిన ఎపిటైజర్స్, సూప్ తెచ్చాడు

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments